క్లుప్తంగా

తప్పిదాలు సరిచేయాలని కలెక్టర్‌కు వినతి



వినతిపత్రం ఇస్తున్న హన్మాజిపల్లె దళితులు

గన్నేరువరం: హన్మాజిపల్లె గ్రామంలో ఎస్సీ జనాభాను గుర్తించడంలో జరిగిన తప్పిదాలను సరిచేయాలని కోరుతూ గ్రామానికి చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు, దళితులు మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. కరీంనగర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో కలిసి 2001లో ఎస్సీ జనాభా 547 గుర్తించారని, 2011లో కేవలం 53 మంది అని నమోదు చేశారని, సర్వే షీట్ ప్రకారం 529 జనాభా ఉన్నట్లు చూపిస్తోందని, తప్పుడు లెక్కలతో ఇరవై ఏళ్లుగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, గ్రాంట్స్, రిజర్వేషన్ల పరంగా రాజకీయ హక్కులను పొందలేక లేకపోతున్నామని విన్నవించారు. ఎస్సీ వార్డుల్లో జనరల్ రిజర్వేషన్లు వచ్చాయని, దీంతో అన్యాయం జరుగుతుందని, జనాభా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఫీల్డ్ అసిస్టెంట్ పారునంది అశోక్, పారునంది మహేశ్, సొల్లు రమేశ్, అమ్మిగల్ల రాజు, అజయ్, అంజయ్య పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి, తదితరులు

జమ్మికుంట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) బీఆర్ గవాయ్‌పై మతోన్మాది దాడి హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సైదాబాద్ గ్రామంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. మతోన్మాది రాకేశ్‌కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సనాతన ధర్మం పేరుతో దాడులకు తెగబడుతున్నారని, రాజ్యాంగ ధర్మమే గొప్పదని, లౌకిక ప్రజాస్వామిక ధర్మాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధంకావాలని, ఎర్రజెండాకు ప్రజలు మద్దతుగా నిలిచి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, మండల కార్యదర్శి శీలం అశోక్, కమిటీ సభ్యులు వడ్లూరి కిషోర్, జక్కుల రమేశ్, దండిగారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తున్నామని అంబేడ్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు దొంత రాజయ్య అన్నారు. దేవుని పేరుతో కష్టజీవులపై దాడులు చేస్తే సహించమని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

చిగురుమామిడి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. బస్టాండ్ ఎదుట ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు తాల్లపల్లి తిరుపతి, జిల్లా కార్యదర్శి విష్ణుమాచారి, తదితరులు పాల్గొన్నారు.

కేపీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి

చొప్పదండి: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మంగళవారం డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కేపీఆర్ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాంబరాజు, ఇంచార్జి శంభయ్య, సతీశ్, శ్రవణ్, సంధ్య, హసీనా, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

వెలిచాలలో వైద్యశిబిరం

రామడుగు: మండల కేంద్రంలోని వెలిచాల గ్రామంలో మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సుజిత్ 120 మందికి వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గుర్రం కిరణ్, కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, గూడురి మహేశ్ పలువురు పాల్గొన్నారు.

ఏళ్లు గడుస్తున్నా పట్టింపు లేదు



చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట నుంచి పొట్లపల్లి(హుస్నాబాద్ మండలం) గ్రామాల మధ్య ఉన్న మట్టిరోడ్డు వర్షాలకు పూర్తిగా ధ్వంసమైంది. నవాబుపేటకు చెందిన రైతులు వ్యవసాయభూముల వద్దకు రాత్రి, పగలు వెళ్తుంటారు. గతేడాది వర్షాకాలం రోడ్డు మరమ్మతుకు నోచుకోకుండా అలాగే ఉందని, కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డు పైనుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ఏటా నానా ఇబ్బందులు పడుతున్నామని, నాలుగు కిలోమీటర్ల దూరం ఉన్న మట్టిరోడ్డు మధ్యలో రెండు చిన్న బ్రిడ్జీలు, ఒక కల్వర్టు నిర్మిస్తే ఎంతో అనుకూలంగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. కాగా పొట్లపల్లి స్వయంభూ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నామని, ఏటా శివరాత్రి సమయంలో సుందరగిరి, కొండాపూర్, హుస్నాబాద్ నుంచి పొట్లపల్లికి వెళ్లాలంటే 14 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నేరుగా వెళ్తే కేవలం నాలుగు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని, రోడ్డు మరమ్మతు చేయించాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించామన్నారు. అలాగే ప్రస్తుత రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామ పర్యటనకు వచ్చిన సందర్భంగా రాతపూర్వకంగా విన్నమించామని, ఏడాది గడుస్తున్నా నిధులు మంజూరు, రోడ్డు మరమ్మతు చేయించలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

స్పందన





శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌లో ఎలక్ట్రికల్ బస్సులకు విద్యుత్ వైర్లు తగలకుండా మంగళవారం ట్రాన్స్‌కో సిబ్బంది చర్యలు చేపట్టారు. ఎలక్ట్రికల్ బస్సులు బస్టాండ్‌లోకి రాగానే విద్యుత్ వైర్లు తగులుతున్నాయని ఈ నెల 5న సాక్షిలో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ సంపత్‌రెడ్డి బస్సులకు విద్యుత్ వైర్లు తగలకుండా సిబ్బందితో తీగలను సరి చేయించారు.

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

విద్యుత్ అధికారుల పొలంబాట





శంకరపట్నం: మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు, గన్నేరువరంలో..

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్, వంకాయ గూడెం గ్రామాల్లో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సొంతంగా మరమ్మతు చేయొద్దని ఏఈలు సంపత్‌రెడ్డి, రఘు సూచించారు. రైతులు అధికారికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, లూజ్‌లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఉంటే సిబ్బంది దృష్టికి తీసుకురావాలన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోకుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు.

గన్నేరువరం: రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీ శ్రీనివాస్ అన్నారు. గన్నేరువరంలో విద్యుత్‌శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. కెపాసిటర్లు అమర్చుకోవడం వల్ల మోటార్లు కాలిపోకుండా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడకుండా ఉంటుందని తెలిపారు. వోల్టేజీ సమస్య లేకుండా మెరుగవుతుందని రైతులకు వివరించారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కారించడంతో మెరుగైన సేవలు అందించేందుకు పొలంబాట నిర్వహిస్తున్నామని, రైతులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. రైతులు, విని యోగదారులు సొంతంగా విద్యుత్ పనులు చేయొద్దని, విద్యుత్ సరఫరాలో సమస్యలను విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. ఏఈ ఆంజనేయులు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రామడుగు: సేఫ్టీ పరికరాలు అందజేస్తున్న టెక్నికల్ డివిజన్ ఇంజినీర్ ఉపేందర్

రామడుగు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912 ఫిర్యాదు చేయాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్వీ వేణుగోపాలాచారి సూచించారు. మండలంలోని గుండి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు నిర్వహించారు. గంగాధర నుంచి మూడు, చొప్పదండి, రామడుగు నుంచి ఒక్కొక్కరు ఫిర్యాదు చేశారని తెలిపారు. సమావేశంలో ఫైనాన్స్ సభ్యుడు ఎన్. దేవేందర్, డీఈఈ రూరల్ తిరుపతి, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ సత్యనారాయణ, గంగాధర, రామడుగు, చొప్పదండి ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పల్లకి సేవ



చొప్పదండి: అభిషేక పూజలో భక్తులు

చొప్పదండి: ఆశ్వయుజ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం, పల్లకి సేవ ద్వారా ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణ శివారులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదం అందజేశారు.

వైభవంగా చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో మంగళవారం బొడ్రాయి ఐదో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు డింగరి మణికంఠ, పృథ్వీరాజ్, భాస్కర్, కృష్ణమాచార్యులు చండీయాగం, కుంకుమపూజలు చేశారు. అనంతరం గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ఊరేగింపు, గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

బకాయిలు విడుదల చేయాలి

హుజూరాబాద్: రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదివే 25 వేలకు పైగా విద్యార్థులకు సంబంధించిన రూ.180 కోట్ల బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ మంగళవారం ప్రకటనలో కోరారు. బకాయిలు రాకపోవడంతో స్కీమ్ కింద చదువుతున్న విద్యార్థులను రావొద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు.

నియామకం

చొప్పదండి: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యదర్శిగా చొప్పదండి పట్టణానికి చెందిన ప్రముఖ ఉపాధ్యాయుడు మొలుమూరి రమేశ్ నియామకమయ్యారు. సమితి రాష్ట్ర కమిటీ విస్తరణలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేశ్‌కు అవకాశం కల్పించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ.. వెనుకబడిన బీసీ కులాల ఆర్థిక, రాజకీయ, సామాజిక ముందడుగుకు తనవంతు కృషి చేస్తానని, నియామకానికి సహకరించిన సహచర బీసీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

22 వాహనాలు సీజ్



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ వెంకట్

శంకరపట్నం: కేశవపట్నంలో మంగళవారం హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్సై శేఖర్‌రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్‌లేని 22 వాహనాలను సీజ్ చేశారు. రోడ్డు భద్రతా నియామాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

ముందస్తు అడ్మిషన్లు తీసుకోవద్దు

విద్యానగర్(కరీంనగర్): 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అడ్మిషన్ షెడ్యూల్ ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేయనందున విద్యార్థులు ప్రైవేట్ జూనియర్ కాలేజీల్లో ముందస్తు అడ్మిషన్లు తీసుకోవద్దని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగిస్తే అలాంటి కాలేజీలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైన్స్ టెండర్లకు 45 దరఖాస్తులు

కరీంనగర్ క్రైం: జిల్లావ్యాప్తంగా వైన్‌షాప్‌ల టెండర్లకు మంగళవారం వరకు 45 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మంగళవారం మూడు దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు.



జమ్మికుంట: వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్, అధికారులు

ఘనంగా వాల్మీకి జయంతి

జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వాల్మీకి జీవిత చరిత్ర గొప్పదని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాజిరెడ్డి, జేఏవో రాజశేఖర్‌రెడ్డి, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్లు వాణి, భాస్కర్, శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, సదానందం, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

చిగురుమామిడి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి బోయ సంక్షేమ సంఘం చిగురుమామిడి మండల అధ్యక్షుడు పెనుకుల తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. బోయల సమస్యలను ఐకమత్యంతో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు సురేష్, పెనుకుల సంపత్, చిట్యాల దుర్గయ్య, వెంకటయ్య, శ్రీకాంత్, అజయ్, వినయ్, శివ, రాజయ్య పాల్గొన్నారు.



చిగురుమామిడిలో...

మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం



చిగురుమామిడిలో ఎమ్మార్పీఎస్ నాయకుల ధర్నా

చిగురుమామిడి: రాష్ట్ర మంత్రి, దళిత నేత అడ్లూరి లక్ష్మణ్‌ను మరో మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్య పదజాలంతో దూషించినందుకు నిరసనగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇజం వెంకటస్వామి, జిల్లా నాయకులు మారెపల్లి శ్రీ ను, ఉపాధ్యక్షుడు జిల్లాల్ల రమేశ్, జిల్లా కార్యదర్శి ఏడేల్లి సంపత్, ప్రచారకార్యదర్శి కాత మల్లయ్య, నాయకులు బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.



జమ్మికుంటలో నల్లబ్యాడ్జీలతో నిరసన

మంత్రి పొన్నం క్షమాపణ చెప్పాలి

జమ్మికుంట: రాష్ట్ర రవాణా, బీసీ, సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహచర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా దళితులు హాజరుకాలవాలని కోరారు. అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మంద రాజేశ్, మొలుగూరి దిలీప్, గాజుల భాస్కర్, పాతకాల రమేశ్, కొలుగూరి నరేశ్, ఎల్లపల్లి నాని, బండారి ప్రశాంత్, జక్కే ప్రేమ్, ఎర్ర సతీశ్ తదితరులున్నారు.

ఇక మహిళా బ్లూకోల్ట్స్ సేవలు







తిమ్మాపూర్: సమస్యలు తెలుసుకుంటున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది, వీణవంకలో సేవలను ప్రారంభిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ, జమ్మికుంటలో సీఐ రామకృష్ణ

తిమ్మాపూర్: మహిళల భద్రతకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సూచనల మేరకు జిల్లాలో మహిళా బ్లూ కోల్ట్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. తిమ్మాపూర్ సర్కిల్ పరిధి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ మహిళా పోలీసులు మండలంలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో సైబర్ క్రైమ్స్, ఇతర నేరాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు బ్లూకోల్ట్స్ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

జమ్మికుంట: మహిళా పోలీసులు ఉదయం వేళ విధుల్లో ఉంటారని టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ సేవలను ప్రారంభించారు. మహిళలకు మరింత భద్రత కలుగుతుందన్నారు.

వీణవంక: మండల కేంద్రంలో జమ్మికుంటరూరల్ సీఐ లక్ష్మీనారాయణ మహిళా బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సేవలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళ సిబ్బంది పెట్రోలింగ్ చేస్తారని, గ్రామాలలో అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆవుల తిరుపతి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్క దాడిలో గాయాలు

వీణవంక: మండల కేంద్రంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. యశ్వంత్ అనే యువకుడు నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కొద్ది రోజులుగా గ్రామాల్లో పిచ్చికుక్కలు వీధుల్లో తిరుగుతూ దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి..

తిమ్మాపూర్: ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మన్నెంపల్లికి చెందిన రావుల అరవింద్, స్నేహితుడు బీనపల్లి రాకేశ్‌తో కలిసి కరీంనగర్ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో అరవిందుకు తీవ్ర గాయాలు కాగా, రాకేశ్ స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు 108లో హాస్పిటల్‌కు తరలించారు.

'గీష్పతి' పుస్తకం ఆవిష్కరణ



కరీంనగర్ కల్చరల్: ఉపాధ్యాయ కవి కేవీ గోపాలాచార్య రచించిన గీష్పతి పుస్తకాన్ని మంగళవారం నగరంలోని భవానీ సాహిత్య వేదిక కార్యాలయంలో తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి ఆవిష్కరించారు. అందరికీ ఈ పుస్తకం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. అన్నాడి గజేందర్‌రెడ్డి పుస్తక పరిచయం చేశారు. సంస్థ అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన కార్యక్రమంలో నగునూరి రాజన్న, మఠం సాంబమూర్తి, తిరుమల్‌రెడ్డి, బొమ్మకంటి కిషన్, పీఎస్ రాజు, శ్యామసుందర్, సంగోజు శ్రీనివాస్, జలందర్‌రెడ్డి, బోడకుంట రమేశ్, సైతం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్‌లో పనులు త్వరగా పూర్తి చేయాలి



ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని ఫిల్టర్‌బెడ్‌లో వివిధ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఫిల్టర్‌బెడ్‌ను సందర్శించి నిర్మాణ పనులు, పంప్‌హౌస్‌లు, మోటార్‌పంప్‌లను తనిఖీ చేశారు. 14 ఎంఎల్‌డీ, 34 ఎంఎల్‌డీ ఫిల్టర్ నుంచి వచ్చే బ్యాక్ వాషింగ్ వాటర్‌ను తిరిగి వినియోగించేందుకు సంప్ నిర్మించాలన్నారు. సంప్ నిర్మాణ పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలని సూచించారు. బూస్టర్ పంప్ హౌస్ వద్ద వాల్స్ రీపేర్స్, పైప్ లైన్ లీకేజీకి సంబంధించిన పనులు చేపట్టాలన్నారు. అమృత్‌లో భాగంగా 10 ఎంఎల్‌డీ ఫిల్టర్ల పెండింగ్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. వాటర్ పైపు లైన్ పంప్స్, వాల్స్ ఇతర మరమ్మతు పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసి పనులను చేపట్టాలన్నారు. నీటి శుద్ధీకరణ కేంద్రంలో క్లోరినేషన్‌ను పగడ్బందీగా చేపట్టి నీటి నాణ్యతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ సంజీవ్ కుమార్, యాదగిరి, డీఈ దేవేందర్, ఫిల్టర్ బెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: పెరిగిపోతున్న సైబర్ నేరాల నియంత్రణను మరింత పటిష్టపర్చాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి కాశిపాక రాజేశ్ కోరారు. ఈమేరకు మంగళవారం నూతనంగా డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. నేరాల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కరీంనగర్ జిల్లాలో ఇటీవల సైబర్‌నేరాలు, ఈవ్‌టీజింగ్, డ్రగ్స్ పెరిగిపోతున్నాయని, నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

యోగా పోటీల్లో పతకాలు సాధించాలి

కరీంనగర్‌స్పోర్ట్స్: మైసూర్‌లో ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు జరుగు 50వ సీనియర్స్ జాతీయస్థాయి యోగాసన పోటీల్లో కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులు పతకాలు సాధించాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ అన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఎంపికైన యోగా క్రీడాకారులు స్వరూపచారి, ఎల్.కోటేశ్వరరావు, ఆమని, సుగుణ, ప్రవళికలను మంగళవారం కరీంనగర్‌లోని తారక హోటల్‌లో సన్మానించారు.